# ప రి త్య క్తు డు

"బాబాయి గారిని కొట్టిన వాడిని అందరూ కలిసి పట్టుకున్నారండీ! వాడి పేరుట ఆనందమోహనుట!" అని పదిమంది పిల్లలు పరుగెత్తుకుంటూ వచ్చి సువర్ణతో చెప్పారు.

అంతలో ఆమె తల్లి వచ్చి "అమ్మాయీ! వాడిని మన వాకిట్లోకి తీసుకొచ్చారు. పోలీసులు కూడా వెంబడే ఉన్నారు. ఆయన దగ్గరికి వాడిని తీసుకొచ్చి చూపిస్తారుట. ఆయనేమయినా గుర్తు పట్టగలిగితే వాడికి శిక్ష పడుతుందని అంటున్నారు" అంటూ గదిలోకి వచ్చే వాళ్ళకు తోవ యిచ్చింది.

పదిమంది పట్టుకొని ఒక యువకుడిని లోపలికి తీసుకొని వచ్చారు. అతడు చిన్నవాడే ఇరవై రెండు-ఇరవై మూడు ఏళ్ళు ఉండీ లేనట్లు ఉన్నాయి. ఎర్రగా, బక్క-పలచగా ఉన్నాడు. చెదరిన క్రాపూ, నలిగిన ఉన్నిబట్టలూ, ఎడమ కణతకు రూపాయంత వెడల్పున ఎర్రటి పుట్టుమచ్చ. తలవంచుకొని అతడు వాళ్ళతో నడుస్తూ మునలమ్మను, ఆమెను ఆనుకొని ఉన్న సువర్ణను చూస్తున్నాడు సువర్ణ చెవిలో తల్లి మెల్లగా అంటున్నది. "నేనప్పుడే సందేహించానే—వీడు ఒక వేళ మన ఆనంద మోహను కాడు గద!" అని, ఆపోలిక చూశావా? ఎంత అచ్చు గుద్దినట్లుగా ఉన్నదో! వాకిట్లో వాళ్ళతో మాట్లాడుతుంటే విన్నాను. కంఠధ్వని ఎట్లా ఉన్నదనుకున్నావు?"

సువర్ణ తలపైకెత్తి తల్లి ముఖము చూసి 'ఆఁ' అంటూ కళ్ళుగట్టిగా మూసుకున్నది. తల్లి ఆమెను పడకుండా పట్టుకున్నది. సువర్ణ కళ్లు మూసుకుని గజగజ వణకిపోతున్నది. ఆ యువకుని లోపలికి తీసుకొనిపోయిందీ, తారకనాథు బాధతో మూలుగుతూ కూడా అతడిని కళ్లు తెరచి చూసినదీ, తిరిగి వాళ్ళందరూ అతడిని పట్టుకుని వెళ్ళిందీ ఏదీ ఎరుగదామె.

సరిగా పన్నెండు సంవత్సరాల క్రిందట ఒకసారి మధ్యాహ్నపు వేళ తల్లి అన్నది. సువర్ణతో "అమ్మాయీ? ఆ వెలమ జమీందారుడు ఏదో పని మీద ఈ ఊరు వచ్చాడట. వాళ్ళతో పిల్లవాడు ఉన్నాడని తెలిసింది సుమా! బాగా ఎదిగాడట! మన తోటమాలిని లోపలికివెళ్ళి చూడమన్నాను. మనము ఒకసారి వెళ్ళి చూద్దామా?"

ఆ మాటకే సువర్ణ నిలువునా వణకిపోయింది. కళ్ళుగట్టిగా మూసుకుంది. పది పదిహేను దినాలవరకు వీధి ముఖము చూడలేదు. కడుపులోకి సరిగా ఆహారం లేదు. కంటిమీదికి కునుకులేదు. అకస్మాత్తుగా ఆమె వాడి వత్తిలా అయిపోవటము తారకనాథుని ఆశ్చర్యపరిచింది. వైద్యులు పరీక్ష చేశారు. ఎటూ నిర్ణయము చేయలేక పోయారు. చివరకు హిస్టీరియా అని శంకించారు.

తల్లి ఎంతో నొచ్చుకున్నది. ఉబుసుపోక తానే ఎందుకు చెప్పినట్టూ కబురు? సువర్ణ యింకా మరచి పోలేదు. కన్న కడుపుకు మరపు ఉండదని తనకేం తెలుసు? తన కొక్కతే కూతురు. ఆ కూతురు చక్కగా బిడ్డలతో పచ్చపచ్చగా కాపురము చేస్తున్న దాయెను.

ఏడాది క్రిందట ఊరంతా గుప్పుమన్నది. జమీందారు భుజంగరాయడు పెంచుకున్న కొడుకు గ్రామాలన్నీ దోయించు తున్నాడట. ఎవరో యిద్దరు స్నేహితులల్లే ఉన్నన్నాళ్ళూ ఉండి, చివరకు ఆ జమీందారుగారి కొడుకును మోసగించి. అంతా తీసుకొని పోయారనీ, ఆ కొడుకు దౌర్జన్యమువల్లనే ఊరు ఊరంతా ఆ కుటుంబము మీద తిరుకబడి నాశనము చేశారనీ. ఆకుటుంబాని కంతకూ ఈ పిల్లవాడొక్కడే మిగిలాడనీ నీలివార్తలు పాకిపోయాయి. ఒకసారి జమీందారు ఈ కొడుకును కొట్టబోతే పాపము జమీందారిణి కళ్ళ నీళ్ళు కారుస్తూ "బాధ భరించలేకనేగా పరాయమ్మ కన్నబిడ్డ కొరకు కొంగు పట్టాను? వాడినేమీ అనకండి. ఆ అనేదేదో నన్నే అనండి" అన్నదట. అతడికి కూడా కళ్ళు చెమ్మగిలి పిల్లవాడెంత కావాలంటే అంతా యివ్వటము ఏది చేయమంటే అది చేయడమ్ము మొద్దలు పెట్టాడట.

ఈ వార్త వింటూనే సువర్ణగుండె బయటికి వినబడేతంట గట్టిగా కొట్టుకొనేది. ఆ తాకిడికి ఆమె ఊగిపోయేది. ఆమెకళ్ళు గట్టిగా మూసుకొని అను

కునేది "వాళ్ళు పెంచుతున్నారు గాని-కన్నారా ? అంత వెర్రి ఏమిటి" అని. ఆమె నమ్మలేక పోయేది.

సరిగా ఇరవై రెండేండ్లనాడు సువర్ణ ప్రసూతి వైద్యాలయము నుండి ఇంటికి వచ్చింది. పుట్టినబిడ్డ విషయము ఆమె మరచి పోవాలని ఎంత ప్రయత్నము చేసిందో అంత ఎక్కువగా. ఇతరులు పరామర్శకని వచ్చి జ్ఞాపకము చేసిపోతూ ఉండేవారు.

"పండు వంటి పిల్లవాడు కళ్ళల్లో మెదుల్తున్నాడు. నీవు మనసు ఎట్లా సమాధాన పెట్టుకుంటుంన్నావో"నని తల్లి ఉదయాస్తమానమూ ఇదే మాట.

సువర్ణలతకు మూడు కాన్పులయినా అప్పటికి ఒక్కబిడ్డయినా ఇంట్లో తిరుగలేదు. నాలుగవసారి కాన్పుకు వైద్యాలయానికి వెళ్ళమని చెప్పి ఆమె తల్లిని పిలిపించి తారకనాథు విదేశాలకు వెళ్ళాడు. పుట్టబోయే బిడ్డ కంటె, బిడ్డపుట్టిన తరువాత జరుగబోయే సంఘటనలను గురించి మనసు రాయి చేసుకొమ్మని ఆమెకు అనేక విధాలుగా అతడు చెప్పి వెళ్ళాడు. సువర్ణకు ప్రసూతి వైద్యాలయలో పది పౌనుల పిల్లవాడు పుట్టాడనగానే నర్సులూ, డాక్టర్లూ ఆశ్చర్యముతో ఆ సాయంత్రము వరకు వచ్చి చూసి పోతూనే ఉన్నారు. తెల్లగా దంతపు బొమ్మలాంటి పిల్లవాడు మిసమిసలాడే బుగ్గలతో నల్లటి ముంగురులతో పుట్టగానే సువర్ణ తల్లి మురిసిపోయింది.

పిల్లవాడి అందచందాలను గురించీ. పోలికలను గురించ్ అందరూ అనుకోగా విన్న సువర్ణ కళ్ళు గట్టిగా మూసుకుని ప్రక్కకు తిరిగి పడుకున్నది.

"దేవుడికి తనమీద ఎంతకోపమో ! అంద చందాలతో చక్కటి పిల్లలను యిచ్చి-మురిపించినట్లే మురిపించి-మాయం చేస్తున్నాడు. ఇప్పుడు వీడి పనీ యింతే !" అప్పటి కప్పుడే సువర్ణ మనసులో ఆ పిల్లవాడు పెరిగినట్టూ-కొంత కాలము మురిపించి చనిపోయినట్టూ-ఆ బాధ కొద్దీ తాను మెలికలు తిరిగి పోయినట్టూ భావపరంపర వేగముగా సంచరించింది.

వెంటనే సువర్ణ డాక్టరును పిలిపించి-బుద్ధి పూర్వకముగా పిల్లవాడిని తాను-ఎవరికైనా ఇవ్వదల్చుకొన్నట్లు చెప్పి-ఏదైనా ఏర్పాటు చెయ్యమన్నది. సువర్ణకు మతి పోయిందేమోనని తల్లితో పాటు డాక్టర్లుకూడా భయపడ్డారు.

ఎంత సేపటికీ సువర్ణ చెప్పేది ఒక్కటే మాట-"పుట్టిన బిడ్డను నేను కంటితో చూడను. నా చూపు తగిలితే పిల్లవాడు చచ్చిపోతాడు-కనుక ఎవరికైనా ఇచ్చివేయండి" అని.

తల్లి అనేకవిధాలుగా చెప్పి చూసింది-ఇతరులు చాలా మంది మందలించారు-ఆ పట్టు మానమని. కాని-సువర్ణది ఒకటేపట్టు.

మధ్యాహ్నము పన్నెండుగంటలకు పుట్టిన పిల్లవాడిని కంటితోనైనా చూడకుండా సాయంత్రము అయిదు గంటలవరకూ సువర్ణ కళ్ళుమూసుకునే పడుకున్నది.

కరారు పత్రము - సాక్షుల సంతకము అంతా పూర్తిచేసి - సువర్ణలత కుమారుని-నాలుగవ నెంబరు గదిలో చనిపోయి పుట్టిన కుమారుని తలచుకొని ఏడ్చే వెలమ జమీందారిణికి యిచ్చే ఏర్పాట్లు జరిగాయి.

సువర్ణలత అప్పుడు కళ్లు తెరచి నాలుగు మూలలూ కలయజూసింది. వైద్యాలయములో ఉన్న పదిరోజులూ తనమీది బారమేమిటో దిగిపోయినట్లు విశ్రాంతగా ఉన్నది.

ఇంటికి వెళ్ళిన తరువాత రాత్రిళ్ళు నిద్రపట్టక బాధపడేది ! ఆ వెలమ జమీందారిణిని ఆ పిల్లవాడు ఎంత దుఃఖ పెట్టుతున్నాడో...... పెంచిన మమకారము. పాపమామెను ఒకవేళ బాధించడము లేదుకదా ! మరో అయిదు నిమిషాల పాటు ఆమె మనసులో ఆ హాలాహలాన్ని తాను మ్రింగకుండా-తన మనసు చెదరిపోకుండా-తనను తాను కాపాడుకొన్న విధమామెకు చాలా సంతృప్తి నిచ్చేది. దాని తరువాత తారాజువ్వలాంటి ఆలోచన పైకెగసి-క్రిందికి దూకేది-'వాడు.... బ్రతికి ఉండి ఆమెనెంత మురిపిస్తున్నాడో ! !

పక్కమీద మసలగా మసలగా తెల్లవారు జామునకు ఎప్పుడో కన్ను మూతపడేది.

అయిదు నెలల తరువాత తారకనాథు వచ్చాడు. ఉత్తరము ద్వారా తెలిసినా-కంటితో నాలుగవసారి కూడా పాపాయి లేకుండా ఒక సువర్ణనే ఆ యింట్లో చూసేసరికి అతడికి కూడా మనసు చివుక్కుమన్నది.

అతడి ఆగమనమూ - అతడందుకొన్న ప్రమోషనులూ ఆమెకు ఉత్సాహాన్ని కలిగించ లేకపోయాయి. కాలప్రవాహము ముందుకు నెట్టుకొని పోయి ఆమె చేత మరో యిద్దరు బిడ్డలను పెట్టింది. ఆమెకు ఒక్క-క్షణమైనా తరువాత తీరిక లేక పోయింది. బాలసఖ్యుల సందడి, జిలిబిలి పలుకుల చిన్నగేయాలకు తాళము వేసే చిరుపాదాల మువ్వల సవ్వడి అహర్నిషలూ ఆమె మనసును లయింపచేసు కున్నాయి. కాని-మెరుపులాంటి ఊహలు మెరసి ఆమె కళ్ళను మూయిస్తునే ఉన్నాయి అప్పుడప్పుడు.

కొట్టిన యువకుడూ పోలీసులూ అందరు వెళ్ళిపోయిన తరువాత కళ్ళు మూసుకునే సువర్ణ తారకనాథుని పడుకోబెట్టిన గదిలోకి వెళ్ళి అతడి గాయాన్ని చేతితో తమిడిచూసింది. ప్రమాదము లేక పోయినా పెద్దగాయమే తగిలిందన్నారు వైద్యులు.

క్రిందపడి పోకుండా గోడనానుకొని సువర్ణ తారకనాథునితో అన్నది "వాడెవరనుకున్నారు? నాలుగవ సారి కూడా నన్ను ఏడిపించడానికి పుట్టిన బాకీ దారుడు. నా చూపు తగిలితే వాడు చనిపోతాడని ఎవరికో పెంచుకోటానికి యిచ్చే శాను. నా మటుకు నేను వాడిని పోయిన వాడి క్రిందే జమ కట్టుకున్నాను. వాడు పెరిగి పెద్దవాడైనాడు..... కాని దుర్మార్గుడైనాడని వింటున్నాను. వాడి విషయా లన్నీ మా అమ్మ ఎట్లాగో తెలుసుకుని నా చెవిన వేస్తూనే ఉంటుంది. వాడిని నాముందర అనేక విధాలుగా వర్ణిస్తూ ఉంటుంది. వాడు చనిపోయినా నాకు కష్టము కలుగకుండా నా మనసు బాధపడకుండా నేను పన్నిన ఉపాయమది, కాని నన్ను ఆ బాధ మరో రూపములో ఏడిపిస్తూనే ఉన్నది" అని.

తారకనాథు కళ్లు తెరచి ఆమె చెప్పినదంతా విన్నాడు. అ విషయములో అదివరలో సువర్ణ తనకు చెప్పుతూ వచ్చినదంతా వాస్తవమని అతడు ఎప్పుడూ అనుకోలేదు. గాని తరచి అమెను అడిగి బాధించదలచుకొనలేదు. కాని అపుకో లేక "ఆ మాట ముందుగా చెప్పితే పోలీసు వారితో మాట్లాడి ఉందునుగా! నా వెనుక ఎంత సేపటినుంచీ నడుస్తున్నాడో మరి-హఠాత్తుగా జేబులో చెయ్యిపెట్టి పర్సు తీశాడు. నేను చెయ్యి గట్టిగా పట్టుకున్నాను. తప్పించుకోటానికని తలమీద కొట్టాడు. ఒక్క-మాటలో శిక్ష తప్పించి వేద్దునే!" అని కొంచెము కఠినముగానే అన్నాడు.

సువర్ణ అసలే ఈ బాధతో మానసికంగాను దైహికంగాను అతిబలహీనమై పోయింది. దానిపైన రక్తము కారుతున్న గాయాన్ని చూపింది. ఈ స్థితిలో ఇంత కాలమునుండి చెప్పకుండా దాచిన మాటను ఈ విధంగా తారకనాథ్‌తో చెప్పవలసి వచ్చింది. ఆమెకు నరాలలో పట్టుతప్పి పోయింది.

"మీతో ఈ మాట ముందుగా చెబ్బితే-వాడిని యింటికి తీసుకొని వస్తారు. నా విషపు చూపు పడితే-వాడు కాస్తా........ఉండడు........భూమిమీద ఉండడు" అని హిస్టీరియా రోగి అరచినట్లు అరచి కళ్ళు గట్టిగా మూసుకొని నేలమీద పడి పోయింది సువర్ణ.